# ఓ కథా! నీ పేరేమిటి?

పోతినేని
వసుంధరాదేవి

'నువ్వు నా పెళ్ళానివా? నాన్సెన్స్. ఎవ డా మాట అంది. నువ్వు నన్ను పాలించే రాణివి. నన్ను కాపాడే దేవతవి. ఒక మగాడికి పెళ్ళాంలా పడి ఉండేది మామూలు ఆడది. నువ్వు మామూలు స్త్రీవి కావు. దైవ స్వరూపిణివి. నీకు నీవే సాటి. నిన్ను పొందిన అదృష్టం ఈ ప్రపంచంలో నా కొక్కడికే లభించింది. ఈ అమృత భాండాన్ని చేజారకుండా ఎంత అపురూపంగా చూసుకోవాలో తెలియక ఎంత తికమక పడుతున్నానో తెలుసా?" భార్యని ప్రేమ, ఆరాధనతో చూస్తూ, ఆమె ఒళ్ళో తల పెట్టుకొని చల్లని, చిక్కటి వెన్నెల్లో తనను తాను మరిచిపోయి తన్మయత్వంతో చెప్పుకు పోతున్నాడు కథలోని నాయకుడు శ్యామలరావు. మధ్యలో తన మాటల్ని ఆపి, "అరుణా! నా మాటలు బోర్ కొడుతున్నాయి కదూ? అసలు వింటున్నావా?" అని అడిగాడు.

"వింటున్నాను—చెప్పండి" అంది కథా నాయిక అరుణ, అతి మెల్లని స్వరంతో.

"నేను పట్టి వెధవని, అరుణా! నువ్వేమో నీ నిండైన వ్యక్తిత్వంతో చుక్కల్లోకి తేలిపోతుంటావు. నేను నిన్ను చేరుకోలేక పోతున్నాను, అరుణా!" కంఠంలో ఆవేదన.

'నిజంగానే నీవు పట్టి వెధవవే కాదు, శ్యామలరావూ! వెధవన్నర వెధవవి! లేకపోతే మీ ఇద్దరి మధ్య అంత చెప్పలేని అన్యోన్యతా? ఎందు కంత చవటలా పెళ్ళాం ముందు దిగజారి మాట్లాడతావు?' గట్టిగా, కసిగా తిట్టుకొంది కథలోని హీరో శ్యామలరావుని, ఆ కథ చదివే సుందరి.

ఇంతలో చెవులు చిల్లులు పడేలా సైకిల్ బెల్ మోత. వీధి తలుపులు ఒక్క ఉదుటున లోపలికి తోసిన పిడుగులాంటి ధ్వని. ఉరుములు, పిడుగులతో పాటు గాలి దుమారంలా లోపలికి వచ్చాడు సుందరి భర్త శంకరరావు. మనిషి కనబడక ముందే చెవులు చిల్లులు పడేలా బాణాల్లా మాటలు దూసుకు వచ్చాయి! "నీకు ఏ కోశానైనా బుద్ధి అనేది ఉంటే నన్నింత కాల్చుకు తినవే! నీ పుస్తకాల్ని, నిన్ను తగలబెట్టా! పొద్దస్తమానం అవేనా నీకు కూడూ కూరా పెట్టేది. నే నేమైనా సంపాదించి పెడుతున్నానా? పగలంతా గాడిద చాకిరి చేసేవాణ్ణి. నే నేమై పోయినా పర్వాలేదు. రాణివాసం వెలిగిస్తున్నావే, రాణివాసం!" ప్రతి రోజూ అట్లాంటియుద్ధం జరగందే ఆమె పనిలో జొరబడదు.

అరగంటలో భోజనంచేసి మళ్ళీ ఆఫీసుకు వెళ్ళిపోవాలంటే శంకరరావు ప్రతిరోజూ దండకం విప్పందే పని జరగదు. కథలో హీరో శ్యామలరావుని శంకరరావుగాను, అరుణను తన్నుగాను ఊహించుకొంటూ ఊహా లోకాల్లో తేలిపోతున్న సుందరి ఒక్కసారి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చి, తల విదిలించి లేచి నిలబడింది. అప్పటి వరకు పడుకొని నవల తదేకంగా చదువుతూనేవేమో, ఒక్కసారిగా లేచి నిలబడే సరికి కళ్ళు బైర్లు కమ్మినట్లయింది. తన స్థితి, చుట్టూ పరిసరాలు, త నెక్కడున్నది ఒక్కొక్కటి అర్థం కావటం మొదలుపెట్టింది.

"ఏమి టా వెర్రిచూపులు, మవ్వానా—దయ్యంగాని పట్టిందా?" అరిచాడు శంకరరావు. 'మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులు' అనుకుని శంకరరావు మాటలకు ఎదురు చెప్పడం ఎప్పుడో మానుకొంది సుందరి.

గబగబా బాత్ రూమ్‌కి పరిగెత్తి శంకరరావుకి బకెట్‌తో నీళ్ళు, సోపు, తువ్వాలు అందించి, వంటింట్లోకి పరిగెత్తి స్టౌ వెలిగించి అప్పడాలు, వడియాలు వేయించి, సగంలో ఉడికి ఆగిపోయిన కూరని పోపుపెట్టి, నెయ్యి కరగబెట్టిపోసింది సుందరి. ఈ పనులన్నీ పెండింగులోనే ఉంటాయని శంకరరావుకి తెలుసు. అందుకే అడ్వాన్సు పే చేశాడు ముందుగానే. ఆ పోపులోని ఘాటుకి శంకరరావు తిక్క తారాపథానికి చేరింది.

"అడ్డగాడిదలా మంచానికి చేరబడి ఆ వెధవ పుస్తకాలు చదవకపోతే వంట పూర్తి చేసుకుని ఏడవరాదూ? టైము సంగతి కూడా పట్టకుండా ఒళ్ళు మరిచిపోయావన్న మాట?" అంటు శివం ఎత్తిన వాడిలా నోటికి వచ్చినట్లుగా అరవ సాగాడు. ఉహూ! సుందరి మాట్లాడితేగా? మౌనంగా పీట వాల్చి అన్నీ దగ్గిర పెట్టి పెరటివేపు వెళ్ళింది.

నిజంగా ఆ పనులన్నీ పూర్తి చేసుకొని తీరుబడిగా చదువుకోవచ్చు నామె. కాని, అలా చెయ్యదు. పని తుది మొదలు తెలీకో, లేక శంకరరావుమీద నిర్లక్ష్యమో చెప్పడం కష్టం. "ఎప్పుడు చూసినా ఏడుపు మొహం, నువ్వూను—చిద్దోడుతు, నీళ్ళు కారుతు ఉంటావు." మిగిలిన నాలుగు అక్షింతలు నెత్తిమీద చల్లి ఊరుకున్నాడు, మజ్జిగ వడ్డించ డానికి వచ్చిన భార్య మీద.


భోజనం అయిందనిపించి బయటకు వెళ్ళేసరికి సుందరికి ముచ్చెమటలు పోశాయి. 'రోజు ఉండే తతంగమేగా ఇది? ఈ రోజు కొత్తా? పనిలో తను కొంచెం అశ్రద్ధ చూపిస్తే. ఆ మాత్రానికే ఇంత రగడ చెయ్యాలా? అదే శ్యామలరావయితే అరుణని అన్ని తిట్లు తిట్టేవాడా? ఎంత అపురూపంగా చూసుకొంటాడు! దాంపత్యం అంటే అలా ఉండాలి. తనూ ఉంది ఎందుకు? దేనికి నోచుకోలేదు. తనది మాడు మొహంట! మొహం మాడ్చుకొనడానికి కారణం తను కదూ? వచ్చిన దగ్గిరనించి శాపనార్థాలు తప్పితే, నోటి నుండి కమ్మని మాట రాదు' అనుకొంటూ రోషంతో ముక్కుపుటాలు ఎగర వేసుకుంటూ మళ్ళీ మంచానికి అడ్డం పడింది పుస్తకం తెరవడానికి. వంటింట్లో సామాను ఎక్కడిది అక్కడే చిందర వందరగా పడి ఉంది, ఎంగిలి కంచాలతో. వాటికంక ఓ సారి అసహ్యంగా చూసింది. 'హాయిగా పుస్తకం తెరిచి చదువు కొంటూంటే గొడవలన్నీ మరిచిపోవచ్చు' అనుకొంటు పుస్తకం చేతిలోకి తీసుకొంది.


అట్ట వెనక రచయిత్రి బొమ్మ కనబడింది. 'ఎంత అదృష్టవంతురాలు! తన కథే అయి ఉంటుంది. పెట్టి పుట్టింది. లేకపోతే అంత అపురూపంగా చూసుకొనే భర్త దొరుకుతాడా?' అనుకొంది. 'రచయిత్రిది స్వంత అనుభవం కాకపోతే అలా అంత చక్కగా ఎలా వ్రాయగలుగుతుంది?' అనుకుంది హాఫ్ నాలెడ్జి సుందరి. ఆగిపోయిన పేజీల మధ్య వేలుంచి, ఇంటి కప్పుకేసి చూస్తూ తదేకంగా ఆలోచించ సాగింది. శ్యామలరావుకి, అరుణకి ఎప్పుడూ పోట్లాట రాదా? తన భర్త తనను తిట్టే తిట్లలో నూరో వంతయినా తిట్టడా? కథల్లో, సినిమాల్లో హీరోలయితే చక్కగా లేవగానే ఎటూ చూడకుండా, ముందుగా భార్య ముఖాన్నే చూస్తారు. తను ఎన్నో కథల్లో చదివింది. ఒకసారి తన స్నేహితురాలు సరళేం చెప్పింది? వాళ్ళాయన తన భోజనం మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాడట. వేడిచేసే వస్తువులు తిననీడట. ఎప్పుడైనా ఆవకాయ ముక్క వేసుకుంటానని తను మారాం చేస్తేనట్ట.. కారం అంతా తుడిచేసి, ముక్కని నీటిలో ముంచి తినిపిస్తారట! ఆ మాటల్ని నమ్మడానికి సుందరి మనస్సు ఇష్టపడ లేదు. 'ఆఁ! దానిదంతా మరీ విడ్డూరం!' అంటూ చప్పరించేది. ఏ కథ చదివినా సుందరికి మనస్తాపమే గాని, సంతోషంగా ఒక కథని కూడా ఎంజాయ్ చెయ్యలేదు. కథలో హీరో ఎప్పుడయితే హీరోయిన్ని లాలనగా దగ్గిరికి తీసుకుంటాడో, వెంటనే తన భర్త శంకరరావు కళ్ళలో మెదుల్తాడు. దానితో ఇద్దరి మధ్య ఉన్న అగాధాన్ని ఎంతో పూడ్చాలని చూస్తుంది. కాని, అది యోజనాల దూరం పెరుగుతూందేగాని తరగదు. దానితో శంకరరావు మీద, తన సంసారం మీద, పెళ్ళి కుదిర్చిన పెద్ద మనిషిమీద, తల్లిదండ్రుల మీద వరసగా పేరు పేరున తిట్టుకొంటూ కాసేపు కళ్ళు మూసుకొని గాని, మళ్ళీ పుస్తకం తీసి చదవటం మొదలెట్టదు. మధ్య మధ్యలో స్వంత ఆలోచనల్ని

కోడిస్తూ ఉంటుంది. భార్యా భర్త లెప్పుడూ ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకొంటూ కలల్లో తేలిపోతూ, ఒకర్ని గురించి ఒకర్ని పొగుడుకొంటూ ఉంటారు కాబోలు! ఎంత విచిత్రం! పెళ్ళయిన దగ్గర నుండి ఏనొక్క అనుభూతిని కూడా ఎరుగదు. పెళ్ళయిన కొత్తలో నాలుగైదు నెలలు బాగున్నా దేమో! అంతే. తరవాత నుండి ఇదీ వరస!

సుందరిది వాస్తవాన్ని వాస్తవంగా తీసుకోలేని ప్రవృత్తి. గాలిలో తేలిపోతూ, నవలా ప్రపంచంలో మునిగిపోతూ, అప్పు డప్పుడు వాస్తవాన్ని గుర్తు తెచ్చుకొని, ఒడ్డున పడ్డ చేపలా ఊపిరాడనట్టుగా గిజ గిజ కొట్టుకుంటుంది. ఎప్పుడైనా భార్యాభర్తలు కథల్లో కీచులాడు కొన్నట్టు కనపడినా లేక అతి లేమితో బాధపడుతూ పూట గడవడం దుర్భరంగా ఉండి రోగాలతో, కష్టాలతో తీసు కొంటున్నట్టు కథ నడుస్తూంటే 'ఛీ


# ఇరాస్మిక్ అవలంబించే 'నిప్పు మరియు మంచు' పద్ధతి మూలంగా సాధ్యపడింది ఒక అనన్య సామాన్యమైన బ్లేడు





'నిప్పు మరియు మంచు' పద్ధతి : ఇరాస్మిక్ స్టెయిన్‌లెస్‌ను అత్యంత శ్రేష్ఠమైన ఉక్కుతో చేసారు. అతి తీవ్రమైన ఉష్ణోగ్రతలకు గురిచేస్తారు, అంటే 1100 డిగ్రీలు సెంటిగ్రేడు నుంచి —70 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు. ఈ 'నిప్పు మరియు మంచు' పద్ధతితో సరిగ్గా అవసరమైన గట్టిదనం. ఈ బ్లేడు అంచును, శ్రద్ధతో పర్యవేక్షించి, నిశితంగా సానపట్టి, చర్మంతో, అతి సున్నితమైన అంచు వచ్చేవరకు పాలిష్ చేస్తారు.

ఆటోమేటిక్ జెట్ ద్వారా, సరిసమానంగా టెఫ్లాన్ చిమ్ముతారు—ప్రపంచంలోకల్లా ఎక్కువ ఖరీదు చేసే బ్లేడ్లలాగే. దాంతో సున్నగా గెడ్డం గీసుకోవచ్చు.

## ఇరాస్మిక్ స్టెయిన్‌లెస్ గడ్డాన్ని అత్యంత నున్నగా గీసేటందుకు

IS:7371




అద్భుతమైన బ్లేడ్ అనువైన ధరలో


లింటాస్—ESB.2-203 TL

దరిద్రవు గొట్టు కథలు! ఇది చదువుకొంటున్న కాస్సేపయినా మనస్సుకు సంతోషం ఉండదు. వెధవ ఏకులు, చింతలు' అనుకొంటూ పుస్తకాన్ని దూరంగా విసిరికొడుతుంది. ఏడుపు సినిమాలు, పతివ్రతల సినిమాలు ఆమె చూడలేదు. ఆమె ఆనందించే కథలు, సినిమాలు వాస్తవానికి చాలా చాలా దూరంగా ఉండాలి. వాస్తవానికి దగ్గరగా తన బ్రతుకులా, చుట్టుపక్కల వాళ్ళ బతుకుల్లా ఉంటే ఆమె చీదరించుకొంటుంది.

ఎవరైనా ఒక జంట సాయంత్రం పూట—భర్త బిడ్డ నెత్తుకొని, ఆ అమ్మాయి భర్త వెంట హాండ్ బాగ్ చేతికి తగిలించుకొని కులాసాగా నవ్వుకొంటూ నడుస్తూంటే వారి వంక చూడ్డానికి తన రెండు కళ్ళు చాలనట్టుగా చూస్తుంది. అదే ప్రపంచం అనుకొంటుంది. ప్రపంచంలో ఉన్న ఆనందమంతా వారిద్దరిలోనే ఇమిడి ఉన్న దనుకొంటుంది. వాళ్ళకు మరో ప్రపంచం, తనలాగ తిట్ల ప్రపంచంలా ఉండ దనుకొంటూ అలా అలా ఊహాలోకాల్లోకి తేలిపోతూ, చివరికి తన భర్త శంకరరావు మీద ఆలోచనల్ని కేంద్రీకరిస్తుంది.

వాస్తవానికి శంకరరావు కూడా ఎప్పుడు కోపదారి కాదు. ఆదివారాలప్పుడు సుందరిని సినిమాలకని, ఫ్రెండ్సింటికని తీసుకువెళ్తూనే ఉంటాడు. ఎప్పుడైనా బయటికి వచ్చినప్పుడు ఆమె పనులు, చూపులు అతనికి గిట్టవు. ఎవరింటికైనా వెడితే ఆ ఇంటి దంపతులు ప్రదర్శించే అన్యోన్యతను చూసి అతి ముచ్చట పడిపోతుంది, ఆ ఇంటి ఇల్లాలితో వారి అనురాగాన్ని గురించి ఇంకా ఇంకా అడిగి చెప్పించుకొంటుంది. దానితో తా నెంతో ఒంటరిగా ఫీలవుతూ మానసికంగా దిగజారిపోతుంటుంది.

శంకరరావు అలా కాదు. ఎప్పటి కోపం అప్పుడే. ఎప్పటి సంతోషం అప్పుడే అనుభవించేస్తాడు. ఊహా ప్రపంచంలో తేలిపోవడం, గాలిలో మేడలు కట్టుకోవడం అతని కిష్టం ఉండదు. ఇప్పటి కోపాన్ని కాస్సేపటికి గుర్తు పెట్టుకోడు. జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా అనుభవించా లంటాడు అతడు. సంతోష సమయంలో దుఃఖాన్ని, కష్ట సమయంలో సంతోషాన్ని ఎరువు తెచ్చుకుని కృత్రిమంగా గడపడం అతనికి ఇష్టం ఉండదు. ఆఖరికి తలనొప్పి అయినా, దాని సహజ గుణాన్ని మొండితనంగా అనుభవించా లంటాడు. అందుకే నేల మీద అడుగులు బలంగా గుచ్చి నడిచే



ఒక ధ్యానం
ఫోటో— జి. ప్రభసింగరావు
(హైదరాబాదు)


శంకరరావుకి, రెక్కలు కట్టుకొని ఊహా లోకంలో ఎగిరిపోయే సుందరి చేతి కందకుండా గాలిలో తేలిపోతూంటుంది.

శంకరరావు చూడ్డానికి చాలా కఠినంగా కనిపిస్తాడు. మనస్సు వెన్నలాంటిది అని చెప్పలేం గాని, బయటికి కనబడే టంత కఠినత్వం అతని మనసుకు లేదు. సుందరి ప్రవర్తన, ఇంటి వాతావరణం అతన్ని విచ్చలవిడిగా అరిచేటట్టు చేస్తాయి. మధ్యాహ్నం పూట అలాగా అరిచి తిట్టి వెళ్ళినా, సాయంత్రానికల్లా ప్రశాంతంగా ఇంటికి తిరిగి వస్తాడు. మధ్యాహ్నపు కోపం ఛాయలు ఏమ్మాత్రమైనా ఉండవు. అయితేనేం—సుందరి మాత్రం మరిచి పోలేదు. అతను ఆఫీసు నుండి వచ్చే వరకు కథల్లోని పాత్రలకు—శంకరరావు తత్వానికి మోకాటికి, బోడికి కలిపి ముడివేసినట్టు పోలుస్తూ కూర్చుంటుంది. అందుకే ఆ ముఖాన్ని మాడు ముఖం అంటాడు శంకరరావు. తాను ఇంటికి వచ్చేసరికి ఆమె పని అంతా ముగించుకొని, నీటుగా తయారయ్యి వేరే వ్యాపకం లేకుండా తనకోసం నవ్వు ముఖంతో ఎదురు రావాలని చాలా చిన్న కోర్కెనే కోరుకుంటాడు అందరిలా. కాని, ఇది అతను విరుద్ధంగా అతను ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా చిందరవందరగా ఉంటుంది. కుంపటిలో ఎగిరి స్వెట్లు, గిన్నెలు కాకులు దొర్లిస్తూ ఉంటాయి. అప్పుడే అంటించిన బాయిలర్ పొగ ఇల్లంతా, [illegible] కూడా ఊపిరాడకుండా చేస్తుంది. సుందరి మాత్రం మంచం మీద అడ్డదిడ్డంగా పడుకొని కాళ్ళు ఊపుతూ పుస్తక పఠనంలో నిమగ్న అయి ఉంటుంది. శంకరరావుని చూడగానే గబగబా లేచి స్టౌ ముట్టించి కాఫీ నీళ్ళు పెడుతుంది. ఆ పరిస్థితి చూసిన శంకరరావు ఏ కాస్తయినా ఓపిక మిగిలి ఉంటే నాలుగు తిట్లు తిట్టి ఉపశాంతి పొందుతాడు. లేదూ.. నీరసంగా ఉంటే ఆ మట్టునే బయటకు పోయి ఏ హోటల్లోనో గుక్కెడు కాఫీ పొట్టలో పోసుకొని, ఏ పార్కులోనో పిచ్చాపాటి కాలక్షేపం చేస్తాడు.

అలా కూర్చున్నప్పుడు పచ్చికపై మీద ఈగలు ముసిరినట్లుగా అతన్ని సుందరిని గూర్చిన ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఆమెకు పుస్తకాలు అందకుండా చెయ్యాలని ఎన్నో ప్రయత్నాలు చేసి చూశాడు. కాని, ఒక్కటీ ఫలించలేదు. పది లైబ్రరీలు, పదిహేను లైబ్రరీలు చుట్టి పుస్తకాలు అద్దెకు తెప్పించుకొని చదివి సంతోషిస్తూ ఉంటుంది. చివరికి తెలుసుకున్నాడు

పుస్తకాలు ఆమె ఊపిరి. వాటిని ఆమెకు అందకుండా చేసినప్పుడు ఆమె శ్వాస ఆగిపోతుంది. ఇక అప్పుడు సుందరే మిగలదు.

వీలుకలిగినప్పుడు శంకరరావుకూడా నవలలు చదువుతూంటాడు. ఈ మధ్య వచ్చే పుస్తకాలు కొన్ని అతన్ని మరీ చికాకు పరుస్తున్నాయి. వీటివల్లే సుందరి మరీ అంత నిర్లక్ష్యంగా తయారయిందని అతని అభిప్రాయం. నిజంగా నిజ జీవితంలోఎవడైనా పెళ్ళాన్ని— నన్ను కాపాడే దేవత అని, నన్ను పాలించే రాణివి, నేను వట్టి గాడిద కొడుకుని, చవటని, నీ ముందు నేను దివిటీ ముందు గుడ్డి దీపంలా వెల వెలా పోతున్నాను అని అంటే, ఆవిడ నేలమీద నడుస్తుందా? నిజంగా తన వ్యక్తిత్వం చుక్కల్ని అంటుతూంది కాబోలు. ఈయన నేను చెప్పినట్లు నడుచుకోకపోతే నలుగుర్లో ఎలా మాట్లాడ్డం చేతనవుతుంది? అనుకొంటూ నలుగుర్లోకి వెళ్ళినప్పుడు ఆయన్ని వెనక్కు నెట్టి తను ముందుకు నడుస్తుంది. బస్సుల్లో, రైళ్ళలో భర్తకంటె ముందు వచ్చి నలుగుర్లో తన ఆధిపత్యాన్ని చాటిచెప్పి సుపీరియారిటీ కాంప్లెక్సుని ప్రదర్శిస్తుంది. తన అభిప్రాయం పూర్వంలా ఆడవాళ్ళు ఏమి తెలియకుండా వెనక, వెనక ఉండమని కాదు. భర్తతో సమానంగానే అడుగులు వేసి నడవాలి. కాని, అతని కంటె ముందు ముందు వెళ్ళి అతని వ్యక్తిత్వాన్ని దెబ్బతీయ కూడదు. నీ భార్యకు నీవు ఇతర్లకంటె ఎక్కువ గౌరవ మర్యాద లివ్వు. ఆమె నీ జీవిత భాగస్వామిని కనక ఒకరంటె మరొకరు రెండోవారి మాటను ఎంతో మన్నించి గౌరవించుకోవాలి. ముఖ్యంగా మూడవ వ్యక్తి ముందు ఆ ఇచ్చే గౌరవాన్ని ఆమె గుండెలో దాచుకోవాలి. తన పేరుగాని, తన ఆధిక్యంగాని భర్తకంటె ముందుండాలి అని తాపత్రయ పడే ఆడవాళ్ళు ఇతరుల దృష్టిలో చాలా చులకన అవుతారు. నిజంగా గౌరవం అనేది ఒకరు



శిస్తే పుచ్చుకొనేది కాదు. స్వయంకృషి వల్ల చక్కటి వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలి. వ్యక్తిత్వం అంటే ఇతరులను కరవ వచ్చేట్టుగా, కొట్టవచ్చేట్టుగా ఉండ కూడదు. అప్పుడది అహంభావ మవుతుంది. ఇలా కళ్ళ ముందున్న జీవితాన్ని కాదని ఎక్కడో ఏదో ఆనందం దొరికిపోతుందని, అందులో ఈదులాడుదాం అనే మనస్తత్వం చాలామందిలో ఉంటుంది. దీనంతటికి కారణం అసంతృప్తి. మనసుని కుదించి సరిపెట్టుకోలేక పోవడం. ఎవరు కూడా తమ బాధ్యతల్ని విస్మరించ కూడదు. ఇలా సాగుతుంటాయి అతని ఆలోచనలు. పార్కులో కూర్చున్నంతసేపూ ఈ నాడు వచ్చే సాహిత్యం ఎంతో ఇరుకు మనస్తత్వంతో కూడి, వ్యాపార సరళిలో సాగిపోతుంది. ఒక కథగాని, నవలగాని, సినిమాగాని వాస్తవాన్ని యథాతథంగా చిత్రిస్తే ఎవరు ఒప్పుకోవడం లేదు. ఇప్పుడు వచ్చే కార్టూన్ల మాత్రం ఇంట్లో జరుగుతున్నది ఒకటయితే, అచ్చులోకి వచ్చేది మరొకటి. భర్త పిండి దంచుతున్నట్లు, పొయ్యి ఊది వంట చేస్తున్నట్లు, భార్యకు కాళ్ళుపట్టి విసురుతున్నట్లు అనేక రూపాల్లో చూసినంత సేపూ కార్టూనుగాబట్టి నవ్వాలి గాబోలు అనేటట్టుగా ఉంటున్నాయి. నెత్తిమీద అప్పడాల కర్రతో కొట్టిన దెబ్బ కోడిగుడ్డు పరిమాణంతో పైకి లేస్తే—'సుశీలా! నీ కిది భావ్యమా?' అన్నట్లు చూస్తాడు ఆ భార్యా విధేయుడైన ఆఫీసరు. ఇవన్నీ చూస్తుంటే సుందరి లాంటి వాళ్ళు ఏమను కొంటారు? 'లోకమంతా ఇలానే సాగిపోతూంది కాబోలు! అందరి కళ్ళలోను భర్తలు భార్యలకు అంతగా లొంగి ఉంటున్నారు కాబోలు! తన ప్రారబ్ధమే ఇలా తగలడింది' అని విలపిస్తారు. అందులో సందేహం లేదు. ఒక నవలగాని, సినిమా గాని చూసినప్పుడు అందులోని ఆయా పాత్రల చిత్రీకరణ, దానిలో ఉన్న నీతి, అవినీతులు అని చదివే వారి మనస్తత్వం మీద ఆధారపడి ఉంటాయి. ఆయా వ్యక్తుల మీద వాటి ప్రభావాన్ని చూపెడుతూ ఉంటాయి. అటువంటి వ్యక్తుల్ని మార్చడం చాలా కష్టం. సుందరిలాంటి వాళ్ళు నూటికి 70 మంది ఉంటారని పిస్తుంది. పుస్తకాలతో, సినిమాలతో వ్యక్తిగతంగా తమ జీవితాలను అన్వయించుకొని చూసేవారు కోకొల్లలు. నవలలు, సినిమా కథలు జీవితాన్ని ఒక్కో దృష్టిలో తలపుకు తెచ్చే మాట వాస్తవమే. కాని, సినిమాచూసినంతసేపు, పుస్తకం చదివినంత సేపు తమ జీవితాలకే ముడిపెట్టుకుంటూ కూర్చుంటే రోతగా ఉంటుంది.

సుందరిని తను ఏరి కోరి చేసుకోక పోయినా, పెళ్ళి చూపుల్లో చూడగానే 'ఫర్వాలేదు. సంసార పక్షంగా తనకు మంచికి, చెడ్డకు చేదోడు, వాదోడుగా ఉంటుంది' అనుకొన్నాడు తను. ఇంత నిపుణంగా ఆలోచించ గలిగే తను, మాటల్తో అనునయించి ఆమెను తన మార్గంలోకి తెచ్చుకోలేక పోతున్నాడు. తన భావాల్ని, ఆశల్ని మాటల రూపంలో ఆమె పద్ధతులు మార్చేలాగ చెప్పలేక పోతున్నాడు. కారణం — "తెలిసియు తెలియని నరునికి తెలియం జెప్పంగ బ్రహ్మ వశమే" అన్నట్లుగా ఉంది. తన మూర్ఖపు ప్రవర్తనతో ఇద్దరికి మనశ్శాంతి కాకుండా చేస్తోంది.

దీనికంతటికి కారణం తిండికి, బట్టకు లోటులేక పోవడం అనుకుంటాను. ఏ రోజు తిండికోసం ఆ రోజు పాటుపడేవాళ్ళు నిశ్చింతగా ఉండగలుగుతున్నారు. విపరీతమైన ఆలోచనలకి అవకాశం ఉండక ఐదువేళ్ళు నోట్లోకి పోతూంటే తీరిగ్గా కూర్చుని ఆశల్ని రేపే పుస్తకాలే కాక కేవలం గాలిలో ఎగిరిపోయే విమానాలు, రాకెట్లు, ఫస్టు క్లాసు కంపార్టుమెంటు ప్రయాణాలేకాక, వేల, ఎండ, వాన అనేవి కూడా ఉంటాయని, వాటిలో కడుపునిండా తిండిలేక కష్టపడే శ్రమ జీవులు కూడా ఉంటారని తెలియజెప్పే రచనలు అతి సహజంగా చిత్రీకరిస్తూ సమాజంలోకి వస్తే చాలా మందితో గూడుకట్టుకొని పోయిన నిరాశ నిస్పృహలకి తావుండ దను కొంటాను.

నిజానికి సుందరి, శంకరరావులకు ఒకరి మీద మరొకరికి కోపం లేదు. ద్వేషం లేదు. ఉరికిపోయే ప్రేమలు లేక పోయినా, ఒకరంటే ఒకరికి ఉన్న అభిమానం కాస్తా ఈ దైనందిన కార్యక్రమాల్లో ఒకరంటే మరొకరికి సరియైన అవగాహన లేని నిర్లక్ష్య భావంతో మరుగున పడి పోయింది. అతి సున్నితమైన ప్రేమాభిమానాల్ని నలిగిపోకుండా కాపాడుకోవాలంటే ఇద్దరి ప్రయత్నం ఉండాలి. అనురాగాల్ని మొలకెత్తినప్పటి నుండి వాడిపోకుండా పోషించుకొంటూ రావాలి. తను కూడా కొంత వ్యవధితో నిదానంగా ఆలోచించుకోవాలి. అప్పుడే సుందరి లోని మార్పుకోసం తను ఎదురు చూడ్డానికి అర్థం, అవకాశం ఉంది. శంకరరావు లేచి ఇంటివేపు దారి తీశాడు. *



పై పట్టు
ఫోటో — పి. వి. శర్మ (మద్రాసు-82)